

కోమటిపల్లి వద్ద జరుగుతున్న భూగర్భ రైలు మార్గం నిర్మాణ పనులు

# క్రాసింగ్ కష్టాలకు చెక్

## కోమటిపల్లి వద్ద వడివడిగా భూగర్భ రైల్వే పనులు

- కింద నుంచి ఒకటి.. పైనుంచి రెండు రైళ్లు వెళ్లేలా నిర్మాణం
- 350 మీటర్లు సొరంగ మార్గంలోనే ప్రయాణం
- ఈ నెల చివరలో ట్రయల్ రన్.. సెప్టెంబర్‌లో పట్టాల పైకి..

కాజీపేట, ఆగస్టు 4 : ఉత్తర, దక్షిణ భారతానికి ముఖ ద్వారంగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్ సమీపంలోని కోమటిపల్లి వద్ద భూగర్భంలో రైళ్ల ప్రయాణానికి నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయి. దాదాపు 350 మీటర్ల మేర సొరంగ మార్గం నిర్మిస్తుండగా, ఆగస్టు చివరలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. సెప్టెంబర్‌లో రైళ్లు పట్టాలెక్కనుండడంతో రైళ్ల క్రాసింగ్ సమస్య తీరనున్నది. క్రాసింగ్ సమస్య లేకుండా రైళ్లను నడపాలనే సంకల్పంతో రైల్వే శాఖ కాజీపేట–బల్లార్షా మార్గంలో కోమటిపల్లి–వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సమీపంలో దాదాపు రూ. 32 కోట్లతో భూగర్భంలో సొరంగ మార్గం నిర్మిస్తున్నది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో కాజీపేట ఒకటి. ఢిల్లీ వైపు నుంచి వచ్చే రైలు మార్గం వడ్డేపల్లి చెరువు దగ్గరకు రాగానే 'వై' ఆకారంలో రెండుగా చీలుతుంది. సికింద్రాబాద్ వెళ్లే రైళ్లు కాజీపేట మీదుగా, విజయవాడ మార్గంలోని రైళ్లు వరంగల్ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. మూడు వైపులా రైళ్ల రాకపోకలతో వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో రైల్వే ట్రాక్ రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా వరంగల్ వైపు గూడ్స్ రైళ్లు వెళ్లేంత వరకు.. ఢిల్లీ, బల్లార్షా వైపు నుంచి కాజీపేట, సికింద్రాబాద్ వెళ్లే ప్రయాణికుల రైళ్లను వడ్డేపల్లి చెరువు ప్రాంతం (కాజీపేట ఔటర్)లో నిలిపివేస్తున్నారు. దీంతో ప్రయాణం ఆలస్యమవుతోంది.

**వై ఆకారంలో నిర్మాణం..**


బల్లార్షా నుంచి కాజీపేట, వరంగల్ వైపు రైళ్లు వెళ్లేందుకు 'వై' ఆకారంలో ట్రాక్ నిర్మాణం చేపడుతున్నారు. హసన్‌పర్తి రోడ్ నుంచి వరంగల్ వైపునకు వెళ్లే రైళ్లు భూమి ఉపరితలం నుంచి, కాజీపేట, సికింద్రాబాద్ వైపు వెళ్లే రైళ్లు కోమటిపల్లి వద్ద నిర్మాణం చేపట్టిన భూగర్భం (టన్నెల్)లోకి ప్రవేశిస్తాయి. కోమటిపల్లి దగ్గర రైళ్లు మెల్లమెల్లగా కిందికి దిగుతూ 350 మీటర్లు భూగర్భంలో ప్రయాణం చేసి ఆ తర్వాత పైకి వెళ్తూ వడ్డేపల్లి చెరువు దగ్గర భూ ఉపరితల స్థితికి చేరుకుంటుంది. దీంతో రైళ్ల క్రాసింగ్ సమస్య తీరనుంది. బైపాస్ పనులు పూర్తయితే హసన్‌పర్తి రోడ్ నుంచి అటు వరంగల్ వైపు, ఇటు కాజీపేట వైపు రైళ్లను ఒకేసారి పంపించవచ్చునని అధికారులు అంటున్నారు.

**ఈ నెల చివరలో ట్రయల్ రన్**

రైలు సొరంగ మార్గం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం టన్నెల్‌లో రైలు పట్టాల నిర్మాణం, ఎలక్ట్రిక్ ఇంజిన్‌తో నడిచేందుకు వీలుగా విద్యుదీకరణ పనులు చేపడుతున్నారు. టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో జరుగుతున్న బైపాస్ పనులకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఆగస్టు నెల చివరలో భూగర్భ మార్గం పూర్తవుతుందని, ట్రయల్ రన్ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ మొదటి వారంలో సొరంగ మార్గం గుండా రైళ్లు పూర్తిస్థాయిలో పట్టాలెక్కే అవకాశమున్నట్లు వారు పేర్కొన్నారు.

# సైబర్ నేరగాడి వల

- మీ కొడుకు డ్రగ్ కేసులో పట్టుబడ్డాడని వాట్సాప్ కాల్
- కేసు కాకుండా డబ్బులు పంపాలని డిమాండ్
- కుమారుడు ఇంట్లోనే ఉండడంతో కాల్ కట్ చేసిన తండ్రి




నేరగాడి వాట్సాప్ డీపీ

డోర్నకల్, ఆగస్టు4: ఓ సైబర్ నేరగాడు వాట్సాప్ డీపీలో పోలీసు ఫొటో పెట్టుకొని ఒకరికి వల విసిరాడు. వివరాలిలా ఉన్నాయి.. డోర్నకల్‌కు చెందిన ఖాదర్‌బాబాకు ఓ సైబర్ నేరగాడు ఫోన్ చేసి తాను సీబీఐ నుంచి మాట్లాడుతున్నానని, మీ కొడుకు డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడని, రూ. 30 వేలు ఫోన్ పే లేదా గూగుల్ పే చేస్తే కేసు కాకుండా చూస్తానని తెలిపాడు. ఖాదర్‌బాబా ఏ పోలీసు స్టేషన్ అని అడగగా రూ. 30 వేలు పంపిస్తే వివరాలు చెబుతానని చెప్పాడు. తన కొడుకు ఇంట్లోనే ఉండడంతో సైబర్ నేరగాడి మోసం గ్రహించిన ఖాదర్‌బాబా ఫోన్ పెట్టేశాడు.

- రూ.35 లక్షలతో నిర్మించే గోదాముకు రూ.56 లక్షలు
- మరో గోదాము నిర్మాణానికి పీఏసీఎస్ నిధులతో స్థలం కొనుగోలు
- పోరంబోకు స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభం
- ఆదిలోనే ఆగిపోయిన పనుల కోసం రూ.10 లక్షలు విడుదల
- విచారణ కోసం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు



చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

# చెన్నారావుపేట పీఏసీఎస్‌కు అక్రమాల తెగులు!

## గోదాముల నిర్మాణంలో నిధుల దుర్వినియోగం

వరంగల్, ఆగస్టు 4 (నమస్తేతెలంగాణ): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అతి పెద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల్లో చెన్నారావుపేట పీఏసీఎస్ ఒకటి. గతంలో ఎంతో పారదర్శకతతో ఇతర పీఏసీఎస్‌లకు ఆదర్శంగా నిలిచిన ఈ సంఘానికి ప్రస్తుతం అక్రమాల తెగులు సోకింది. ఇటీవలికాలంగా ఈ పీఏసీఎస్‌పై అనేక ఆరోపణలొస్తున్నాయి. ప్రధానంగా పాలకవర్గంపై ప్రభుత్వ నిఘా విభాగాలకు పలు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ పీఏసీఎస్ నుంచి చేపట్టిన గోదాముల నిర్మాణంలో నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణ స్థానికంగా చర్చనీయాంశమైంది. చెన్నారావుపేట పీఏసీఎస్ నర్సంపేట సమీపంలోని రాజపల్లె గ్రామం వద్ద 500 టన్నుల సామర్థ్యం గల గోదామును నిర్మించింది. కొద్ది నెలల క్రితం ప్రారంభమైన ఈ గోదాము నిర్మాణానికి రూ.56 లక్షలు వెచ్చించినట్లు పీఏసీఎస్ వెల్లడించింది. ఇతర పీఏసీఎస్‌లు ఇదే సామర్థ్యంతో కూడిన ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.35 లక్షలు రూ.35 లక్షలు వెచ్చిస్తే, చెన్నారావుపేట పీఏసీఎస్ రాజపల్లె వద్ద నిర్మించిన గోదాముకు రూ.56 లక్షలు వెచ్చించినట్లు ప్రకటించడంపై అదే మండలంలోని జల్లి గ్రామానికి చెందిన జక్క అశోక్ కొద్దిరోజుల క్రితం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫిర్యాదు చేశారు. రాజపల్లె గోదాము నిర్మాణంలో సుమారు రూ.20 లక్షల దుర్వినియోగం జరిగిందని పేర్కొన్నారు. దీనికితోడు చెన్నారావుపేట పీఏసీఎస్ నెక్కొండ మండలం ముదిగొండ గ్రామం వద్ద మరో గోదాము నిర్మించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు పీఏసీఎస్ నిధులతో అవసరమైన భూమిని కొనుగోలు చేసింది. ఈ స్థలంలో కాకుండా మరో స్థలంలో పీఏసీఎస్ గోదాము నిర్మాణం చేపట్టిందని, పనులు మొదలైన స్థలం ప్రభుత్వానికి చెందిన పోరంబోకుదని జక్క అశోక్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముదిగొండ వద్ద గోదాము నిర్మాణం కోసం చెన్నారావుపేట పీఏసీఎస్ నిధుల నుంచి కొద్దినెలల క్రితం రూ.10 లక్షలు విడుదల చేశారని, పనులు పునాది స్థాయిలోనే నిలిచిపోయాయని అశోక్ తెలిపారు. నిర్మాణ పనులు ఆదిలోనే ఆగిపోయినా నిధులు విడుదల చేయడం దుర్వినియోగమేనని, ఇవి ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. పీఏసీఎస్ నిధులతో కొనుగోలు చేసిన స్థలంలో కాకుండా పోరంబోకు స్థలంలో నిర్మాణం చేపట్టడాన్ని కూడా తప్పుపట్టారు. పోరంబోకు స్థలంలో గోదాము నిర్మించాలనుకుంటే అదే గ్రామం వద్ద భూమిని కొనుగోలు చేయడం నిధుల దుర్వినియోగమే అవుతుందని తెలిపారు. ఇదిలా ఉంటే ఈ పీఏసీఎస్ ఆధ్వర్యంలో వానకాలం, యాసంగిలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిధిలోని రైతులు అద్దె వాహనాల ద్వారా తమ ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించారని, ఇందుకోసం ప్రభుత్వం ఇచ్చిన ట్రాన్స్‌పోర్టు చార్జీలను కూడా పీఏసీఎస్ సదరు రైతులకు ఇవ్వలేదని అశోక్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

### రుణాల అందజేతపైనా..

చెన్నారావుపేట పీఏసీఎస్‌లో మొత్తం సభ్యుల సంఖ్య 9,744. వీరిలో 5,958 మంది గతంలో ఈ పీఏసీఎస్ ద్వారా రుణాలు పొందారు. మిగత 3,786 మంది సభ్యులు 2012–13 నుంచి 2024 మార్చి వరకు సభ్యత్వం పొందారని, ఈ కొత్త సభ్యుల్లో 379 మందికి పాలకవర్గం తీర్మానం మేరకు పాత సభ్యులతో కలిపి రుణాలను అందజేసినట్లు పీఏసీఎస్ ప్రకటించింది. ఈ పీఏసీఎస్‌లో నిధులున్నా 3,786 మంది కొత్త సభ్యుల్లో కేవలం 379 మందికి మాత్రమే రుణ పంపిణీ జరిగిందని, పీఏసీఎస్ రుణాలను అందజేయకపోవడం వల్ల కొత్త సభ్యుల్లో మిగతా 3వేల మందికిపైగా సభ్యులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చిందని జక్క అశోక్ తన ఫిర్యాదులో ప్రస్తావించారు. పీఏసీఎస్‌లో నిల్వ ఉన్న నిధుల నుంచి కొత్త సభ్యులందరికీ రుణాలు ఇస్తే గత కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పంట రుణాల మాఫీ వర్తించి సదరు 3 వేల మందికిపైగా రైతులు లబ్ధిపొందేవారని తెలిపారు. కొత్త సభ్యుల్లో రుణాలు పొందిన వారు కూడా పాలకవర్గంలోని సభ్యుల అనుచరులేనని, విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ పీఏసీఎస్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న పెట్రోల్‌బంకు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపైనా అశోక్ ఆరోపణలు చేశారు. వివరణ కోరడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించగా చెన్నారావుపేట పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి స్పందించలేదు. ఈ పీఏసీఎస్ సీఈవో రవిని ఫోన్ ద్వారా వివరణ కోరగా గోదాముల నిర్మాణంలో అక్రమాలు, రుణాల అందజేతలో ఆరోపణలపై తానేమీ మాట్లాడలేనని దాటవేశారు. చైర్మన్‌తో మాట్లాడండి అంటూ సమాధానం ఇచ్చారు.



# గాలానికి చిక్కిన వాలుగ

## ఆరున్నర కిలోల బరువున్న చేప

వేటగాడి గాలానికి పెద్ద చేప చిక్కింది. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లికి చెందిన గొంది బాలకృష్ణ చేపల కోసం ఇసుకవాగు బ్రిడ్జి సమీపంలో గోదావరి వరద నీటితో ఉన్న వాగులోకి ఆదివారం వేటకు వెళ్లాడు. ఈ సందర్భంగా గాలం వేయగా ఆరున్నర కేజీల వాలుగ చేప చిక్కింది. ఇంత పెద్ద చేపను శ్రమించి బయటకు తీసినట్లు బాలకృష్ణ ఆనందంతో తెలిపాడు. *- వాజేడు, ఆగస్టు 4*

# బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాల్సిందే..

- ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి
- బీసీల హక్కుల కోసం రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, పక్కన ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 4: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాల్సిందేనని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. జాతీయ ఓబీసీ ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బీసీల హక్కుల కోసం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.9వేల కోట్లు కేటాయించి అన్యాయం చేసిందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ ప్రకటించకుండా స్థానిక సంస్థ ఎన్నికల్లోకి వెళ్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్ ని అమలు చేయాలని వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధన కోసం పోరాటమే మార్గమని అన్నారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరునహరి శేషు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమయ్య, నాగపురి రాజుమౌళిగౌడ్, బీజేపీ నా యకులు ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్, విజయబాబు, సాంబమూర్తి, వీరస్వామి, రమే శ్, గడ్డం కృష్ణయ్య, రాములు, బీసీ విద్యార్థి నాయకులు గొల్లపల్లి వీరస్వామి, మాచర్ల శరత్‌చంద్ర, నితిన్, పాలంపల్లి రామ్మూర్తి, వేణుమాధవ్, దారబోయిన సతీశ్, వీర బోయిన తిరుపతి, ప్రశాంత్, ఎల్ రాజగోపాల్, శ్రీనివాస్, మహేశ్వరరావు, శంకర్, నారాయణ, సాంబమూర్తి, శ్రీధర్, వెంకన్న, భద్రయ్య, అరవిందాచారి, కృష్ణమురళీ యాదవ్, రాజేందర్‌గౌడ్, కృష్ణ సుధాకర్, విజయ్‌కుమార్ గౌడ్, గొర్రెల ఐలేశ్‌యాదవ్, మేకల కృష్ణయ్య, పులి రజినీ కాంత్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, గౌరీభాస్కర్, రవీందర్, పద్మ, కేఆర్ చారి, ఉజ్వల్‌కుమార్ గౌడ్, నవీన్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.



నాగపూర్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్న రాజేందర్ (ఫైల్)

# అంచెలంచెలుగా.. అంతర్జాతీయ స్థాయికి..

- పారాలింపిక్స్ అంపైర్‌గా వరంగల్ వాసి
- బ్యాడ్మింటన్ టెక్నికల్ అఫీషియల్‌గా ప్రభుత్వ పీడీ
- స్కూల్ నుంచి క్రమంగా ఎదిగిన రాజేందర్
- అనేక మందిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత




బెంగళూర్‌లో జరిగిన ఖేలో ఇండియా గేమ్స్‌లో టాస్ వేస్తున్న రాజేందర్ (ఫైల్)

కేసముద్రం, ఆగస్టు 4 : వ్యాయామ ఉపాధ్యాయుడు కావాలన్న కోరికను పట్టుదలతో సాధించాడు. స్కూల్ నుంచి అంచెలంచెలుగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ఇప్పటికే పలు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్ (అంపైర్)గా వ్యవహరించాడు. తాజాగా పారిస్‌లో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న 33వ పారాలింపిక్స్‌లో న్యాయ నిర్ణేతగా అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. ఆయనే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్ హైస్కూల్‌కు చెందిన పీడీ కొమ్ము రాజేందర్. బ్యాడ్మింటన్ విభాగంలో టెక్నికల్ అఫీషియల్‌గా నియమిస్తూ ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరిగే పారాలింపిక్స్‌లో ఆయన న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారు.

**రాజేందర్ ప్రస్థానం..**

ఉమ్మడి వరంగల్ జిల్లా నెక్కొండ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఇంటర్మీడియట్, డిగ్రీ వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో పూర్తి చేశారు. వైజాగ్ గీతం యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్, హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంపీఈడీ, తమిళనాడు అన్నామలై వర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశాడు. జేఎన్టీయూ హైదరాబాద్‌లో వ్యాయామ విద్యలో పీహెచ్‌డీ పూర్తి చేసి 2002లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొంది నర్సంపేట ప్రభుత్వ పాఠశాలలో విధుల్లో చేరాడు. షటిల్, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రత్యేక ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర, జాతీయ, యూనివర్సిటీ స్థాయిల్లో పాల్గొని పతకాలు సాధించాడు. అనేక మంది విద్యార్థులకు శిక్షణ నిస్తూ పీఈటీగా, క్రీడాకారుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 2010లో నేషనల్ గ్రేడ్–2 అంపైర్ పరీక్ష రాసి 2వ స్థానం సాధించాడు. 2010, 2020లో జిల్లా స్థాయి ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నాడు. 2011లో బదిలీపై ఇనుగుర్తి ప్రభుత్వ పాఠశాలకు వచ్చాడు. 2013లో నేషనల్ గ్రేడ్–1 పరీక్షలో నాల్గొవ ర్యాంక్ సాధించాడు. రాజేందర్ ప్రతిభను గుర్తించిన బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ అంతర్జాతీయ టెక్నికల్ అఫీషియల్‌గా గుర్తింపు ఇచ్చింది. రెండు సార్లు సీనియర్ వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ అంపైర్‌గా, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ , టాటా ఓపెన్ ఇంటర్నేషనల్ పోటీలలకు టెక్నికల్ అఫీషియల్‌గా పని చేశాడు. పలు జాతీయ స్థాయి పోటీలకూ అంపైర్‌గా వ్యవహరించాడు. 2024లో కేసముద్రం స్టేషన్ హైస్కూల్‌కు బదిలీపై వచ్చాడు. అంకితభావంతో పనిచేస్తూ అనేక మంది విద్యార్థులను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన ఘనత సాధించాడు.

### చాలా సంతోషంగా ఉంది



పల్లెటూరులో జన్మించిన నాకు అంతర్జాతీయ స్థాయి అంపైర్‌గా గుర్తింపు వచ్చి పారాలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది. గురువుల ప్రోత్సాహానికి తోడు పట్టుదలతో ప్రయత్నించడంతో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందాను. పని చేసే ప్రతి పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచిస్తూ, వారిలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నాను. వేసవి సెలవుల్లోనూ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాను.

– కొమ్ము రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు

# మేడారంలో శాశ్వత అభివృద్ధి

- అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- నేషనల్ హైవేను సమ్మక్క-సారలమ్మ కారిడార్‌గా తీర్చిదిద్దాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



విద్యార్థులకు చెక్కులను అందిస్తున్న సీతక్క

తాడ్వాయి/వెంకటాపూర్/గోవిందరావుపేట, ఆగస్టు4: మేడారం శాశ్వత అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసి అక్టోబర్ తర్వాత ముందస్తుగా పనులను చేపట్టాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె కలెక్టర్ టీఎస్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్ జీ, ఓఎస్‌డీ మహేశ్ బాబా సాహెబ్ గీత, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్‌జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డితో కలిసి మేడారంలో పర్యటించారు. ముందుగా భక్తుల వసతి గృహాల వద్ద స్థానిక రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేసి మొక్కలు నాటారు. తాడ్వాయి మండలంలోని 20 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, గోవిందరావుపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

అదేవిధంగా ఎన్‌ఐటీలో సీట్లు పొందిన 11 మంది విద్యా ర్థులకు రూ. 3,62,598 విలువ గల చెక్కు లను పంపిణీ చేశారు. వెంకటాపూర్ మండ లం నందిపాడు గొత్తికోయగూడెంలో నిర్మా ణ్ సంస్థ, ఆడమా మద్దతుతో స్వచ్ఛ మైన తాగునీటికోసం బోర్‌వెల్, వాటర్, ట్యాంక్, కమ్యూనిటీ టాయిలెట్స్, కమ్యూనిటీ షెడ్, స్ట్రీట్ లైట్స్, జంతు నీటి ట్యాంకులు, ఇండ్ల కోసం లైటింగ్‌ను ప్రారంభించారు. తాడ్వాయి ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో కలిసి మేడారం అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గత జాతరలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. నేటి నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అద్భుతంగా తీర్చిదిద్దిన గ్రామంతో పాటు ఆ గ్రామ ఇన్‌చార్జి అధికారికి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సన్మానం చేస్తామన్నారు.

**సమ్మక్క–సారలమ్మ కారిడార్‌గా ఎన్‌హెచ్**

జాతీయ రహదారిని సమ్మక్క–సారలమ్మ కారిడార్‌గా అభివృద్ధి చేసి వివిధ ప్రాంతాలు, పార్కింగ్ స్థలాల్లో జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రదేశాల గురించి తెలియజేసేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కాల్వపల్లి, ఊరట్టం నుంచి వచ్చే రహదారిని రూ.12కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. గద్దెల ప్రాంగణం నుంచి జంపన్న వాగు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడంలో దాతల సహకారం గొప్పదని కొనియాడారు. కొద్ది రోజుల క్రితం తక్కల పాడు గ్రామంలో ఒక బాలిక పాఠశాల నిర్మాణం చేయాలని కోరగా, తాను జిల్లా అధికారులకు చెప్పగా కలెక్టర్, ఎస్పీ స్పందించి 15 రోజుల్లోనే పాఠశాల నిర్మాణం చేసి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవోలు రాజు, సుమనావా ణి, ఎస్సై సతీశ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోటను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

## ఏకో, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తాం

- వచ్చే నెల 9న నగరానికి సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి సురేఖ

ఖిలావరంగల్, ఆగస్టు 4 : వరంగల్ కోటను పర్యాటకంగా తీర్చిదిద్దుతామని, ఏకో, టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. అందుకు తగినవిధంగా ప్రణాళికలు రచించాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం ఖిలా వరంగల్‌లో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డీఎఫ్‌వో అనుజ్ అగర్వాల్‌తో కలిసి రాతి కోట ఉత్తర ద్వారం, ఏకశిల క్రీడా మైదానం, అగడ్త మత్తడి, లక్ష్మీ పత్రి గండి వద్ద ఉన్న త్రికూటాలయం, పురావస్తు శాఖ మ్యూజియం, శంభుని గుడిని పరిశీలించారు. స్వయంభూ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ రాతికోట ద్వారం వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖిలా వరంగల్‌లో నిర్మించిన మున్నూరుకాపు కమ్యూనిటీ భవనంలో అదనంగా మొదటి అంతస్తు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. రాష్ట్ర పురా వస్తు శాఖ మ్యూజియాన్ని వచ్చే నెల 9న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని తెలిపారు. పెండింగ్ నిధులు మంజూరు చేయిస్తామని, యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలన్నారు. కోటలోని 20 ఆలయాలను పునరుద్ధరించి పర్యాటకులు దైవ దర్శనం చేసుకునేలా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. వన మహోత్సవంలో భాగంగా వరంగల్ కోటలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కేంద్ర పురావస్తు శాఖ సీఏ మడిపల్లి మల్లేశం, రాష్ట్ర పురావస్తు శాఖ ఏడీ మల్లూనాయక్, 37, 38 డివిజన్ల కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, ఆర్డీవో కృష్ణవేణి, కుడా పీవో అజిత్‌రెడ్డి, స్థానిక నాయకులు సంగరబోయిన చందర్, సాగర్ల శ్రీనివాస్, బెడిద వీరన్న, అర్షం రాంబాబు, వనపర్తి కరుణాకర్, రావుల రాజేశ్ పాల్గొన్నారు.



రాతికోట ఉత్తర ద్వారం వద్ద నిలిచి ఉన్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ